క్లుప్తంగా

జువాలజీ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న జువాలజీ (జంతుశాస్త్రం) గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయ భాస్కర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ (జువాలజీ)లో కనీసం 50 శాతం మార్కులు సాధించి ఉండాలని, తెలుగు, ఇంగ్లిష్‌లో బోధన చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 10లోపు కళాశాలలో దరఖాస్తులు అందించాలన్నారు.

ఆర్టీసీ సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాయదుర్గంటౌన్: రాయదుర్గం నుంచి అనంతపురానికి నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన సర్వీసును ఆర్టీసీ డీఎం సురేష్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ డీపో నుంచి అంతరాష్ట్ర సర్వీసులతో పాటు ప్రతి గ్రామానికీ ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జాగ్రత్తలతోనే తెగుళ్ల నివారణ



మాయదార్లపల్లిలో దానిమ్మ తోటను పరిశీలిస్తున్న హెచ్ఓ గౌసియాబేగం

కుందుర్పి: ప్రస్తుతం ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పండ్లతోటలు, కూరగాయలు సాగుచేసిన రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని చీడపీడలు నివారించుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి గౌసియా బేగం తెలిపారు. కుందుర్పి, మాయదార్లపల్లి, అప్పిలేపల్లి, బొమ్మాజిపల్లి గ్రామాల్లో రైతులు సాగుచేసిన వివిధ రకాల ఉద్యాన పంటలను ఆమె పరిశీలించారు.

మున్సిపాలిటీలో బదిలీలు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలో ఇప్పటి దాకా మున్సిపల్ కమిషనర్ తప్ప విభాగాల వారీగా అన్ని శాఖల్లోనూ అధికారులెవరూ లేక ఇన్‌చార్జ్‌లతో పాలన సాగిస్తుండేవారు. ఎట్టకేలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా కోనసీమ జిల్లా ముమ్మడివరం మున్సిపాలిటీ నుంచి రవీంద్రనాథ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. కాగా, ఈయన గతంలో రాయదుర్గం మున్సిపాలిటీలో పనిచేస్తూ ముమ్మడివరానికి బదిలీ అయ్యారు. మెప్మా టీపీవోగా ఉన్న విజయభాస్కర్‌ను ధర్మవరానికి బదిలీ చేయగా, అక్కడి నుంచే రాయదుర్గానికి నాగ సుబ్బరాయుడును బదిలీ చేశారు. పరిపాలన విభాగంలో రెవెన్యూ ఆఫీసర్‌గా పని చేస్తున్న కొండన్నను వైఎస్సార్ జిల్లా కమలాపురం మున్సిపాలిటీకి బదిలీ చేయగా, ఇక్కడికి ఎవరినీ నియమించలేదు. డీఈ, ఏఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో పాలన గాడి తప్పుతోంది.

చవితి వేడుకలకు సర్వం సిద్ధం

- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండలో ముస్తాబు
- వినాయక విగ్రహాల ప్రతిష్టకు ఏర్పాట్లు
- విభిన్న రూపాల్లో ఆకట్టుకుంటున్న గణనాథుడు
- జాగ్రత్తలు తీసుకుంటున్న పోలీసులు



విభిన్న రూపాల్లో తయారైన గణనాథుడి ప్రతిమలు

రాయదుర్గం: తొలి పూజకు గణనాథులు సిద్ధమవుతున్నారు. పందిళ్లు వేసి విఘ్నాలకు అధిపతి విఘ్నేశ్వరుడికి చవితి రోజు నుంచి నవరాత్రులు నిర్వహించేలా కార్యచరణ మొదలుపెట్టారు. ఈ నెల 7 నుంచి వినాయక చవితి ఉత్సవాలకు పల్లె, పట్టణాలు ముస్తాబవుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. భారీ విగ్రహాల ఏర్పాటుకు వేదికలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు నిబంధనల ప్రకారం జరిగేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుమారు వెయ్యికి పైగా చవితి పందిళ్లు ఏర్పాటు చేస్తారని పోలీసుల ప్రాథమిక అంచనా. ఉత్సవాలు మొదలైన నాటి నుంచి నిమజ్జనం పూర్తయ్యేవరకూ ఎలాంటి అపశ్రుతులు దొర్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసేలా పోలీసులు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు.

ఉత్సవ కమిటీలే కీలకం..

గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో కమిటీలే కీలకం. నిర్వాహక కమిటీల సభ్యులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా.. ప్రశాంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. చవితి పందిళ్లు విద్యుత్తు తీగలకు తగలకుండా చూడాలి. ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకున్నాకే విగ్రహాల ఏర్పాటు, లౌడ్ స్పీకర్ పెట్టాలి. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పక్కగా ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి సమయాల్లో కాపలాదారులను నియమించాలి.

మట్టి ప్రతిమలే మేలు..

రంగులతో కూడిన భారీ విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుంది. మట్టితో చేసిన ప్రతిమలు పూజిస్తూ ..నిమజ్జనం చేస్తే పర్యావరణానికి మేలు జరుగుతుంది. పూర్వం చెరువుల నుంచి మట్టిని తెచ్చి విగ్రహాలను తయారు చేసేవారు. తద్వారా చెరువుల్లో కొంత మేర పూడికతీత జరిగేది. పూజల తర్వాత విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేసేవారు. ఈ విధానం ద్వారా క్రిమి కీటకాలు కూడా నశించేవి. మట్టి ప్రతిమలను పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని మేధావులు, విద్యావంతులు చెప్తున్నారు.

పీవోపీ విగ్రహాలతో నష్టాలు అనేకం..

పీవోపీ (ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్) విగ్రహాలు నీటిలో కరిగేందుకు ఎక్కువ సమయం పడుతుంది. ఆకర్షణ కోసం ప్రమాదకర రసాయనాలు, రంగులు వాడటంతో నీరు కలుషితం అవుతుంది. రసాయనాల కారణంగా నీటిలో జీవరాశులు చనిపోతాయి. ఆ నీటిని తాగిన మూగజీవాలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది.

చురుగ్గా హిందూ మహాగణపతి ఏర్పాట్లు

రాయదుర్గంలోని కణేకల్లు రోడ్డు హైస్కూల్ మైదానంలో చురుగ్గా హిందూ మహాగణపతి ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. భారీ వ్యయంతో ఈ ఉత్సవాలకు కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. ప్రత్యేక మంటపాలు, సాంస్కృతి కార్యక్రమాలు, పౌరాణిక నృత్యాలతో 11 రోజుల పూజలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు.

పర్యావరణాన్ని కాపాడదాం



మట్టి ప్రతిమలు వాడుకుని పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. హిందూ సంప్రదాయంలో మట్టి, చెట్ల నుంచి సేకరించిన వస్తువులకు అధిక ప్రాధాన్యం ఉంది. ఇవి లేకుండా ఏ శుభకార్యం జరగదు. ఆధునిక పోకడలతో అసలుకే మోసం వస్తుంది. నీరు, నేల, జీవవైవిద్యం పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. భావితరాల జీవితం సుఖమయం చేసేందుకు మట్టి ప్రతిమలను ఉపయోగించాలి. అనుమతుల్లేకుండా విగ్రహాలు ప్రతిష్టిస్తే చర్యలు చేపడతాం. పండుగను ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో జరపుకోవాలి.

– రాణిసుష్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

ఆన్‌లైన్ అనుమతి తప్పనిసరి



వినాయక చవితి పందిళ్లలో విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్ అనుమతి ముందస్తుగా తీసుకోవాలి. ఎంత ఎత్తులో విగ్రహాలు నెల కొల్పుతారు, ఎన్ని రోజులు ప్రతిష్టతిస్తారు..ఎప్పుడు నిమజ్జనం చేస్తారనే విషయం స్పష్టంగా లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలి. మట్టి విగ్రహాలకే ప్రాధాన్యం ఇస్తూ, నిబంధనలకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వహించాలి. మంటపాల వద్ద ఎలాంటి అశ్లీల కార్యక్రమాలు చేపట్టరాదు. కమిటీ నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రతిష్ట నుంచి నిమజ్జనం వరకు ప్రశాంతంగా జరిపించాలి.

– రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం

- జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్



ముద్దలాపురంలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కూడేరు: ముద్దలాపురంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ బుధవారం సందర్శించారు. అక్కడ తయారవుతున్న స్నాక్స్ , ఆహార పదార్థాలు, పరికరాలను పరిశీలించారు. ఇక్కడ తయారవుతున్న ఆహార పదార్థాలను ఎక్కడికి ఎగుమతి చేసి విక్రయిస్తారని కలెక్టర్ ఆ కంపెనీ ప్రతినిధులతో ఆరా తీశారు. ఆర్డీటీ సహకారంతో మహిళా రైతుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు ఆర్డీటీ ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. దళారి వ్యవస్థ లేకుండా రైతు పరస్పర సంఘం తరపున వేరుశనగ ఇతర పంటల దిగుబడులను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మార్కెటింగ్ సదుపాయం లేక ఆశించిన స్థాయిలో అమ్మకాలు లేవని కలెక్టర్ దృష్టికి మల్లారెడ్డి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఫుడ్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈఓ మురళీ కృష్ణ, నాబార్డు డీడీఎం అనురాధ, తహసీల్దార్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి



పోలీసులతో మాట్లాడుతున్న ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి

ఉరవకొండ: ఈనెల 14న నిర్వహించే ఉరవకొండలో నిర్వహించే జాతీయ లోక్అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక ఉరవకొండ కోర్టులో లోక్అదాలత్ పై సివిల్, ఎక్సైజ్ పోలీసుతో లోక్అదాలత్‌పై మేజిస్ట్రేట్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ మాట్లాడుతూ క్రిమినల్, సివిల్ కేసుల కక్షిదారుల్లో జాతీయ లోక్అదాలత్‌పై అవగాహన పెంచి, కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్, ఎక్సైజ్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన కమిటీ ఏర్పాటు

కంబదూరు: మండల కేంద్రంలోని సచివాలయం -2 పరిధిలోబాల్య వివాహాల నిర్మూలనకు ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం గ్రామ స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ 18 ఏళ్లలోపు ఆడ పిల్లలకు వివాహాలు జరగకుండా బాల్య వివాహాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ వనజ అక్కమ్మ ఆదేశాల మేరకు కమిటీని ఏర్పాటు చేశామన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, జీఎంఎస్‌కే నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయనిర్మల, సంపత్తమ్మ, మల్లిక, ఫరీదా, ఆశా కార్యకర్త సుశీల తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ లింగనిర్ధారణ చట్టంపై అవగాహన అవసరం

ఉరవకొండ: గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కౌకుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి అనికేత్ తెలిపారు. బుధవారం బూదగవి జడ్పీ ఉన్నత పాఠశాలలలో బేటీ పఢావో, బేటీ బచావో, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయభాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఆరోగ్య సహాయకులు ప్రసాద్‌రావు, ప్రియాంక, షబానాబేగం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఎంఈఓ ఈరన్న మృతి



కంబదూరు/ కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండలంలోని తిమ్మాపురానికి చెందిన విశ్రాంత ఎంఈఓ ఈరన్న (69) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు.. ఈరన్న బుధవారం వ్యక్తిగత పనులపై పావగడకు కారులో వెళ్తుండగా, కర్ణాటకలోని కెంచమ్మన హళ్లి సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి,బోల్తాపడింది. ఈప్రమాదంలో ఈరన్న తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బంధువులు ఆయన్ను మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఈరన్న తమ్ముడు చిక్కీరప్ప, డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడి మృతి

వజ్రకరూరు: బోడిసానిపల్లిలో ఉదయ్‌కుమార్ (20) మట్టిమిద్దె కూలి గాయపడి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ నరేష్ తెలిపాడు. సర్పంచు మోనాలిసా,గ్రామకార్యదర్శి శ్రీధర్‌రావు, వీఆర్ఓ అరుణ బోడిసానిపల్లికి వెళ్లి ఉదయ్‌కుమార్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనుమతి తప్పనిసరి



సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్

రాయదుర్గం టౌన్: వినాయక విగ్రహాలు, మంటపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో అనుమతి పొందాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఫణికుమార్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన వినాయక ఉత్సవాల నిర్వాహకులు, వినాయక ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు.

బెళుగుప్ప తహసీల్దార్‌గా షర్మిల



బెళుగుప్ప: మండల నూతన తహసీల్దార్‌గా షర్మిల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కళ్యాణదుర్గం తహసీల్దార్‌గా ఉన్న భాస్కర్ బెళుగుప్ప ఇన్‌చార్జ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. తహసీల్దార్‌కు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్ పీరా, ఆర్ఐ నగేష్‌బాబు, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు కార్యాలయ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

హెచ్చెల్సీ యూటీ పనుల పరిశీలన



9వ డిస్ట్రిబ్యూటరీని పరిశీలిస్తున్న ఈఈ వెంకటరమణరెడ్డి, డీఈఈలు

కణేకల్లు: కణేకల్లు హెచ్చెల్సీ సబ్‌డివిజన్ పరిధిలో హెచ్చెల్సీ కాలువతోపాటు పలు డిస్ట్రిబ్యూటరీలను ఈఈ వెంకటరమణరెడ్డి బుధవారం పరిశీలించారు. 9వ డిస్ట్రిబ్యూటరీని సబ్ డివిజన్ డీఈఈ మద్దిలేటితో కలిసి ఈఈ సందర్శించారు. ఈ డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని రైతులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గతంలో హెచ్చెల్సీకి గండి పడిన 112, 117 కిలోమీటర్ వద్ద నిర్వహించిన పనులతోపాటు 119 వద్ద యూటీ పనులను పరిశీలించారు. హెచ్చెల్సీపై ఎప్పటికప్పుడు లస్కర్లతో గస్తీ నిర్వహించాలని డీఈఈకి ఆదేశించారు. ఇదిలా ఉండగా ఐఏబీ సమావేశం తేదీ ఖరారు కాలేదని ఈఈ విలేకరులకు తెలిపారు.

ఘనంగా మారెమ్మ జాతర



బసంపల్లిలోని మారెమ్మ జాతరలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శెట్టూరు: మండలంలోని బసంపల్లి గ్రామంలో గ్రామ దేవత మారెమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమామహేశ్వర నాయుడు, బోయ తిప్పేస్వామి మారెమ్మ జాతరలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక నాయకులు శ్యామ్‌సుందర్ చౌదరి, నాగేంద్ర ఇంట్లో విందు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ సోమనాథరెడ్డి, పోస్ట్ రామకృష్ణ, శెట్టూరు తిప్పేస్వా మి, ఎమ్మెస్ రాయుడు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

పాల వెంకటాపురంలో ఘనంగా జాతర

బ్రహ్మసముద్రం : మండలంలోని పాలవెంకటాపురంలోమారెమ్మ జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, వైఎస్సార్‌సీపీ నేత మాది నేని ఉమామహేశ్వర్ నాయుడు హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహులు నివాసంలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ బసవరాజు, నాయకులు కరణం రాహుల్ , నారాయణపురం వెంకటేషులు, దొడగట్ట నారాయణ, తలారి సత్తి, కిరీటి యాదవ్ , మాజీ ఎంపీపీ మహదేవప్ప, ఎరడికెర ఎర్రిస్వామి , నజీర్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలో నిర్వహించిన మారెమ్మ ఉత్సవాలు బుధవారం ముగిశాయి. కొండప్రాంతంలో ఉన్న అమ్మవారికి పెద్ద ఎత్తున మహిళలు బోనాలు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారి గ్రామోత్సం, బుధవారం మహామంగళ హారతి, గ్రామశాంతితో ఉత్సవాలు ముగిశాయి.

నివారణ ఒక్కటే మార్గం

కూడేరు: హెచ్ఐవీకి మందులు లేవు.. నివారణ ఒక్కటే మార్గమని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. సూపర్ వైజర్ రవీంద్ర, లింక్ వర్కర్ రాజేశ్వరి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



వెంకటాంపల్లి పెద్ద తండాలో సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి తెలిపారు. బుధవారం వెంకటాంపల్లిపెద్దతండాలో అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామూహిక సీమం తాలు నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ పౌష్టి కాహార మాసోత్సవాలు ఈనెల 2 నుంచి 30వరకు జరుగుతున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్ హెచ్.పద్మా పాల్గొన్నారు.

పంటల నమోదుకు పది రోజులే గడువు

కూడేరు: 2024 ఖరీఫ్‌కు సంబంధించి పంటల నమోదు (ఈ-క్రాప్) గడువు ఈ నెల 15తో ముగియనుంది. పంట నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వం అందించే లబ్ధిని రైతులు పొందడానికి అవకాశం ఉంటుంది. కానీ మండలంలో ఇంకా 40 శాతం పంటల నమోదు ప్రక్రియ జరగాల్సి ఉంది. మండల వ్యాప్తంగా 33,054 ఎకరాల్లో అగ్రికల్చర్, హార్టికల్చర్ పంటలను రైతులు సాగు చేశారు. అందులో అగ్రికల్చర్ పంటలు సుమారు 24 వేల ఎకరాల్లో సాగు చేశారు. బుధవారం నాటికి 60 శాతం పంటల నమోదు పూర్తి చేసినట్లు ఏఈఓ శైలజ తెలిపారు.

ఈక్రాప్ నమోదు పారదర్శకంగా చేయాలి

కుందుర్పి: రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలను పారదర్శకంగా ఈక్రాప్ నమోదు చేయాలని ఏఓ మహేష్ తెలిపారు. బుధవారం మండలంలోని నిజవళ్లి, కుందుర్పి రెవెన్యూ గ్రామాల్లో చేపడుతున్న ఈక్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. సిబ్బంది అపర్ణ, గోపి, అనిల్, తిమ్మరాజు, మౌనిక పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ఉరవకొండ: విజయవాడ వరద బాధితులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం విరాళాలు సేకరించారు. ఉరవకొండలోని వ్యాపారులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలతో పాటు సామాన్యుల నుంచి విరాళాలు సేకరించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధార్థ్ తెలిపారు.

కళ్యాణదుర్గంలో...

కళ్యాణదుర్గం: రాష్ట్రంలోని వరద బాధితుల సహాయార్థం ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విరాళాలు సేకరించారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంతో ఆర్డీఓ రాణీసుస్మిత చేతుల మీదుగా విరాళాలు సేకరించారు. మొత్తాన్ని త్వరలోనే సీఎం సహాయనిధికి పంపించనున్నట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ చెప్పారు. అధ్యాపకులు శేషయ్య, సూర్యనాగిరెడ్డి, శ్యాంప్రసాద్, గురుమోహన్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



ఉరవకొండలో ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

ఉరవకొండ: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలలో 6, 8 వ తరగతిలో అదనపు సీట్ల భర్తీకి బుధవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ 8వ తరగతి అదనంగా కేటాయించిన ఒక సీటు కోసం 15 మంది పరీక్షలకు హాజరయ్యారని, 6వతరగతిలో 5 సీట్ల కోసం 85 మంది పరీక్ష రాశారని తెలిపారు. పరీక్షలను సీనియర్ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

పెన్షనర్ల సంక్షేమానికి విరాళం అందజేత

కళ్యాణదుర్గం: పెన్షనర్ల సంక్షేమానికి రిటైర్డ్ హెల్త్ సూపర్‌వైజర్ గంగమ్మ తనవంతు విరాళం అందజేశారు. బుధవారం స్థానిక పెన్షనర్ల భవనంలో గంగమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామికి రూ.10 వేలును అందజేశారు. పెన్షనర్లకు 12వ పీఆర్‌సీని ప్రకటించాలని, కమ్యుటేషన్ కాలాన్ని 12 ఏళ్లు కుదించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

అందరి సహకారంతోనే పీహెచ్‌సీ అభివృద్ధి

బ్రహ్మసముద్రం : అందరి సహకారంతోనే పీహెచ్‌సీ అభివృద్ధి చేసుకుందాం అని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ అన్నారు. బుధవారం బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తహసీల్దార్ ఆర్ సుమతి, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రభావతి , ఈఓఆర్డీ వెంకట్‌నాయుడులతో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎరడి కెర సర్పంచ్ అంజినమ్మ, సూపర్‌వైజర్ రామలక్ష్మి, ఫార్మసిస్టు మహేష్, ల్యాబ్ టెక్నీషియన్ పవన్ పాల్గొన్నారు.

టెన్నికాయిట్‌లో కనుకూరు విద్యార్థుల ప్రతిభ

శెట్టూరు: టెన్నికాయిట్ పోటీల్లో కనుకూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయులు సుధ తెలిపారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ సబ్ జూనియర్ బాలబాలిక జట్ల ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులలో బాలికల జట్టుకు కే జ్యోతి (8వ తరగతి) కే పూజ (8వ తరగతి) పదవ తరగతి నుంచి హెచ్.స్పందన, హెచ్.దీక్షితలు, బాలుర జట్లకు 8వ తరగతి జి.మహీంధర్ ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా ఈ నెల 14 నెంచి 16 వరకు పలాసలో జరిగే రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ క్రీడా పోటీల్లో పాల్గొన్ననున్నట్లు తెలిపారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో కూడా రాణించాలని పీడీ అమరాంజనేయులు, స్కూల్క్ యాజమాన్య కమిటీ చైర్మన్ కిష్టప్ప, ఉపాధ్యాయులు తెలిపారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

వజ్రకరూరు: గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి తేజశ్వి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు. మండలంలోని కొనకొండ్ల లోని 11వ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహారం,రక్తహీనతపై అవగాహన కల్పించారు.

దాడి ఘటనలో 25 మందిపై కేసు నమోదు

రాయదుర్గం(డి హీరేహాళ్): మండలంలోని కల్యంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన 25 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి బుధవారం తెలిపారు.

రైతులకు పరిహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం తగదు



తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామ శివారులో ఉన్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతుల జీవితాలతో ఆడుకుంటోందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున అన్నారు. బుధవారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు రైతులతో కలిసి బాధిత రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ఎదుట బైఠాయించి, నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీల యజమానులు రైతులకు పరిహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపుతోందన్నారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా వచ్చే కాలుష్యంతో దాదాపు 900 ఎకరాలు పంట రైతులు కోల్పోతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ మునివేలుకు వినతిపత్రం అందించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, తాలుకా కార్యదర్శి తిప్పేస్వామి, సీపీఐ ఉరవకొండ కార్యదర్శి మల్లికార్జున, ఏఐటీయూసీ నాయకులు మలికార్జున, సీపీఐ నాయకులు దుర్గన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు అంజి, నేమకల్లు రైతులు రామాంజనేయులు, కృష్ణయ్య, ప్రకాష్, అనంతమ్మ, ఖాసీంవలి పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ఉరవకొండ: మొక్కలను ఎక్కువగా పెంచి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని ఉపాధిహామీ ఏపీఓ విమల తెలిపారు. బుధవారం స్థానిక అంబేద్కర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సునీత అధ్వర్యంలో విద్యార్థినులు ర్యాలీ చేశారు. ఈసందర్భంగా ఏపీఓ, ప్రిన్సిపాలు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వనం-మనం కార్యక్రమం చేపడుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ జయమ్మ, లైబ్రేరియన్ కుళ్లాయమ్మ పాల్గొన్నారు.